# చెత్త కథ

**బం**డోడియా దేశం చాలా సస్యశ్యామలమైనది.

అదేవిటీ? అటువంటి దేశం ఒకటి వుందా? మాకు తెలియదే అని ఆశ్చర్యపోతా రందరూ. మనకు తెలియని దేశాలు బోలెడన్ని వున్నాయి ప్రపంచ పటంలో. ఒలింపిక్స్ ప్రత్యక్ష ప్రసారం చూస్తూ మనం ఏనాడూ పేరు కూడా వినని దేశాలెన్నో పతకాలు గెల్చుకుని కేరింతలు కొడుతూ వుంటే చూసి ఆశ్చర్యపోవడం లేదూ! ఇదీ అంతే!

బండోడియా దేశం ప్రపంచ పటంలో ఓ మూల చిన్న చుక్కంత వుంది. కానీ వుంది. ఈ మధ్యన అదేదో దేశంలో పర్యావరణ మహాసభలు జరిగాయట. ఆ సభలకి మనం వెళ్ళామట. వాళ్ళూ వచ్చారట.

పచ్చదనానికి, పరిశుభ్రతకీ ఆ బండోడియా దేశం అగ్రస్థానంలో నిల్చిందిట. ఆ దేశ ప్రతినిధులు సభ చివర్రోజున కృతజ్ఞతలు తెలియజేసుకుని అక్కడికొచ్చిన వారి నందరినీ తమ దేశానికి ఆహ్వానించారుట.

మనని పిలవనివాళ్ళే పాపకర్ములు. వెంటనే బయలుదేరి బండోడియా వెళ్ళారుట మన మంత్రిగారు. విమానం దిగీ దిగ్గానే మొహం తిరిగి పడిపోయారుట.

ఇంద్రలోకంలా వుందిట బండోడియా. నడిరోడ్డు మీద కూడా పాలు పోసి ఎత్తుకోవచ్చుట. కనుచూపు మేరా పళ్ళతోటలూ, పూలతోటలూనట. మిగిలిన నేలంతా పచ్చిక బయళ్ళుట. అద్దంలా వుందిట ఆ దేశం.

వాళ్ళు వ్యర్థ పదార్థాలను ఎరువుగా మార్చి చెట్లకు వేస్తారుట. చెత్తను రీసైకిల్

చేసి వాడుకుంటారుట. అందుకని అక్కడ దుర్బిణీ వేసి వెతికినా చెత్త కనిపించదుట.

తిరిగొచ్చి ఆ విషయం చెప్పగానే వాళ్ళ సహకారంతో మనకూ మన దేశాన్ని అద్దంలా చేద్దాం, ముందుగా మన రాష్ట్రంతోనే ఆరంభిద్దాం అనుకున్నారుట మన వాళ్ళు.

"అవునలాగే చేద్దాం. ముందోసారి చూసొస్తే బావుటుంది" అనుకున్నారు. ఫ్రీగా విదేశీయానం. కాబట్టి అయిన వారూ, వాళ్ళకు అయిన వారూ గుంపులు గుంపులుగా ప్రభుత్వం ఖర్చుతో బండోడియా వెళ్ళి విహరించి వచ్చారుట.

అటేడు తరాలూ ఇటేడు తరాలూ అయిపోయారు. ఇంకెవ్వరూ లేరు అనుకున్నాక అప్పుడు ఓ నలుగురు నిపుణులని పంపించారుట.

వాళ్ళు వెళ్ళి అక్కడంతా చూసి సర్వే చేశారుట. వాళ్ళకు చెత్తని రీసైకిల్ చేయడానికి కర్మాగారాలున్నాయట. దాన్లో రీసైకిల్ చేస్తారుట.

"మీరు మా దేశం వచ్చి మాకో చెత్త కర్మాగారం కట్టించి పెట్టండి" అన్నారుట మనవాళ్ళు.

"అలాగే దానికేం భాగ్యం" అన్నారుట బండోడియా వాళ్ళు.

వాళ్ళుత్త పిచ్చి సన్నాసులు కాబట్టి రావడమే నలుగురు వచ్చారు వాళ్ళకు మనవాళ్ళు రాచమర్యాదలు చేశారుట.

కృతజ్ఞతగా వాళ్ళు పాపం చిత్తశుద్ధితో పనిచేశారుట.

"అవడానికి మాది దేశమే అయినా మీ రాష్ట్రంలో అయిదో వంతు వుంది. కాబట్టి మీ రాష్ట్రానికి కనీసం అయిదు చెత్త కర్మాగారాలు కావాలి" అని అంచనా వేశారుట.

"అయిదు కర్మాగారాలు ఒక్కసారే అంటే మాకు తలకు మించిన భారం అవుతుంది. కాబట్టి ముందుగా మీరొకటి కట్టించి పెట్టండి. మా వెసులుబాటు చూసుకుని మిగిలిన నాలుగూ కట్టించుకుంటాం" అన్నారుట మనవాళ్లు.

"సరే అయితే అని మళ్ళీ ప్లాను వేశారుట వాళ్ళు. ఎనభై కోట్లు ఖర్చవుతుంది. కొసరు మరో రెండు కోట్లు అనుకున్నా ఎనభై రెండు కోట్లు శాంక్షన్ చేయించుకోండి" అన్నారుట వాళ్ళు.

రుసరుసలాడారుట వీళ్ళు.

"ఎంత ఖర్చవుతుందో చెప్పండి చాలు. ఎంత శాంక్షన్ చేయించుకోవాలో

మేము చూసుకుంటాం” అన్నారుట మనవాళ్ళు.

“సరే అయితే స్థలం, డబ్బు సిద్ధం చేసుకుని మమ్మల్ని పిలవండి. వచ్చి పని మొదలు పెడతాం!” అన్నారుట వాళ్ళు.

మరో సమస్య వచ్చింది. భాష, వాళ్ళేదో వచ్చీ రాని ఇంగ్లీషు మాట్లాడ్డం తప్పించి మనకు పొట్ట పొడిచినా బండోడియా భాష రాదు. కాబట్టి వెంటనే ఓ నలుగురిని పంపిస్తే భాష నేర్చుకుంటారు. అప్పుడు అవగాహన బావుంటుంది. అనుకున్నారుట అందరూ.

వెంటనే నలుగురు పెద్ద మనుషులు బండోడియా వెళ్ళారు భాష నేర్చుకోవడానికి.

మనకున్న సమస్యలన్నీ చెత్తవే. అందులోనూ చెత్త సమస్య మరీ చెత్తది. రోజు రోజుకూ పాపంలా పెరిగిపోతోంది చెత్త. ఇంకొన్నాళ్ళు ఆగితే చెత్తకే తప్ప మనుషులకు చోటుండదు.

కాబట్టి చెత్త సమస్య నివారణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిధులు మంజూరు చేయించుకున్నారట.

రెండొందల ఎనభై కోట్లు.

నగరానికి అంత దూరాన స్థలం ఏర్పాటు చేసుకున్నారు.

ఎనభై అయిదు కోట్లు పక్కన పెట్టి మిగిలిన రెండొందల కోట్లూ తలా కాస్తా పంచుకున్నారు. పేరుకి రెండొందల కోట్లే గానీ ఇంతమంది మీద ఏ మూలకి? మరి పదవికోసం ఖర్చుపెట్టలా? ఎన్నికలప్పుడు పంచడం! పదవిలోకి వచ్చాక పంచుకోవడం! అంతా తలా కాస్తా పంచామృతాలు పంచుకున్నట్లు పంచుకున్నారు. అసంతృప్తిగానే.

మిగిలిన ఎనభై అయిదుకోట్లు అధికార్లకు అప్పగించారు. ఇక వాళ్ళ ప్రహసనం మొదలైంది. ఓ ముప్పై కోట్లు వాళ్ళు పంచుకుని యాభై కోట్లు చెత్త ఫ్యాక్టరీకి వదిలేశారు.

ఏ మాట కామాటే చెప్పుకోవాలి. పంచుకున్నా చిత్తశుద్ధితోనే వ్యవహరించారు. బండోడియా వాళ్ళ ప్లానుకి అవసరం అనుకున్నవాటిని పక్కన పెట్టారు.

వాళ్ళు చెప్పిన ప్రకారం చెత్త ఇరవై నాలుగ్గంటలూ తయారవుతూనే వుంటుంది. కాబట్టి ప్లాంటు కూడా ఇరవై నాలుగ్గంటలూ పని చెయ్యాలి. కాబట్టి అందులో పనిచేసే ఉద్యోగులు అందుబాటులో వుండాలి. కాబట్టి ఫ్యాక్టరీకి దగ్గరే నివాసాలు ఏర్పాటు

చెయ్యమన్నారు.

"ఆ సింగినాదం జీలకర్ర. అరవై కిలోమీటర్లైనా అవలీలగా ప్రయాణించి వర్క్ ప్లేస్‌కి వెళ్ళడం మనవాళ్ళకి వెన్నతో పెట్టిన విద్య. అంతగా అయితే మూడు షిఫ్టులు ఏర్పాటు చేద్దాం" అనుకున్నారు.

"చెత్త కర్మాగారం కాబట్టి చుట్టుపక్కల చాలా ఖాళీ స్థలం వదిలేసి చెట్లు పెంచాలి" అని సూచించారు బండోడియా వాళ్ళు.

"ఫర్వాలేదు గోడ పక్కనే చెత్తకుండీతో బతకడం మా కలవాటే" అంటూ స్థలానికి అంటకత్తెరలు వేసేశారు.

ప్లాంటు మాత్రం యథాతథంగా వుంచారు.

మంచిరోజు చూసి శంఖుస్థాపన జరిపారు. బండోడియావాళ్ళు, అనువాదకులు వచ్చేశారు. ఎక్కువ ఆర్భాటం లేకుండా ఆ కార్యక్రమం జరిగింది.

"అదుగో, ఇప్పుడు ఖాళీగా వున్న ప్రదేశంలో మరికొద్ది రోజుల్లో వెలుస్తుంది చెత్త కర్మాగారం. పరిశుభ్రమైన నగరానికి ఇదవుతుంది శ్రీకారం. కావాలి అందరి సహకారం".

అంటూ వచ్చేశారు, టి.వి. ఛానెల్స్ వాళ్ళు.

మొదలైన పని ఎక్కడా ఆగనివ్వకుండా యుద్ధ ప్రాతిపదిక మీద పూర్తి చేశారు. అనూహ్యంగా అనుకున్న సమయానికి రెండు నెలల ముందుగానే చెత్త కర్మాగారం పూర్తయింది.

ఆర్భాటంగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు.

ఆ చెత్త కర్మాగారం గంటకు ఇరవై లారీల చెత్తని ఎరువుగా మారుస్తుంది.

ప్రారంభోత్సవం నాడు ఓ గంట ప్లాంట్ నడిస్తే ఫోటోలూ అవీ అయ్యేదాకా సరిపోతుంది. మర్నాటి నుంచి మామూలుగా వేళలూ అవీ అమలు పరచవచ్చు అనుకున్నారు.

పాతిక పాత చెత్త లారీలకు రంగులు వేసి కొత్త నెట్‌లు కొని సిద్ధం చేశారు. అనుకున్న శుభదినం రానే వచ్చింది. బండోడియా దేశం నుండి పదిమంది పెద్దవాళ్ళు వచ్చారు.

పేపర్ల నిండా పేజీల నిండుగా ప్రకటనలు ఇచ్చారు.

ముహూర్తం పొద్దున తొమ్మిదిన్నరకి అంతా సందడిగా ఉంది.

"చూస్తున్నారుగా అక్కడంతా పెళ్ళి సందడి. ఆ లారీలు చూడండి కళ్యాణ మండపం మీదికి నడిచివెళ్ళే పెళ్ళి కూతుళ్ళలాగా కళకళలాడిపోతున్నాయి. మరికొద్ది సేపట్లోనే ముఖ్య అతిథిగారు వేం చేస్తారు" అంటూ టి.వి. ఛానెల్స్ ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నాయి.

పోలీసులు, ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులు అటూ ఇటూ హడావిడిగా తిరుగుతున్నారు.

బండోడియా బృందం కారుల్లోంచి దిగి వేదిక వద్దకు వచ్చారు. వారికి మంగళ వాయిద్యాలతో స్వాగతం చెప్పారు. సంప్రదాయ దుస్తులు ధరించిన అమ్మాయిలు వాళ్లకు బొట్లు పెట్టి పూలదండలు వేశారు. వాళ్ళని వేదిక మీద కూర్చోబెట్టారు.

మరి కాసేపటికి ముఖ్యఅతిథిగారు వేంచేశారు. ఆయనకి కొంతమంది పాదాభివందనాలు అవీ చేశారు. కండువాలు మెళ్ళో వేశారు. సభ ప్రారంభం అయింది. అందరూ ముఖ్యఅతిథిగారిని పొగిడారు.

ముఖ్యఅతిథిగారు మైకు ముందుకు వచ్చారు. గతంలో వున్న ప్రభుత్వం నిర్లక్ష్యంవల్ల నగరం చెత్తగా తయారైందన్నారు. తమ ప్రభుత్వం నడుం కట్టుకుని ప్రక్షాళనకు పూనుకున్నదన్నారు. ఇది అంతం కాదు ఆరంభం అన్నారు. వాళ్ళు చేసిన తప్పులన్న సరిదిద్దుతాం అన్నారు. ఇంకా చాలా చాలా అన్నారు.

శుభముహూర్తం ఆసన్నం అయింది. వేద పండితులు మంత్రోచ్చారణ చేస్తూ వుండగా ఒక చెత్త లారీ వచ్చి చెత్తను ఒక కంటెయినర్లో దిమ్మరించింది.

ముఖ్యఅతిథిగారు తమ చేత్తో ఒక స్విచ్ నొక్కారు.

చిన్నగా శబ్దం చేస్తూ ప్లాంట్ ప్రారంభం అయింది. లారీ గుమ్మరించిన చెత్త వున్న కంటెయినర్ పైకి లేచి మరో కంటెయినర్లోకి చెత్తను దిమ్మరించింది.

కరతాళధ్వనులు మారుమోగాయి. మిషన్లూ పని ప్రారంభించాయి. హఠాత్తుగా ఎర్రలైటు వెలిగింది. బండోడియా ఇంజనీర్లు మన ఇంజనీర్లు ఉలిక్కిపడ్డారు. ఏదో పొరబాటు జరిగిందనడానికి గుర్తుగా అలారం మోగింది.

మెల్లిగా మిషన్లు ఆగిపోయాయి. అంతటా కంగారు, ఆదుర్దా. అందర్నీ తప్పించుకుని నిచ్చెన మీదుగా పైకి ఎక్కారు ఇరువైపుల ఇంజనీర్లు. వారి వెంట పరిగెట్టారు అనువాదకులు.

కంటెయినర్లో వున్న చెత్తను చూసి నోరావలించారు. బండోడియా ఇంజనీర్లు.

“ఇదేమిటి?” అన్నారు ఆశ్చర్యంగా.

దుబాసీలు పని మొదలు పెట్టారు.

“చెత్త!” చెప్పారు మనవాళ్ళు

“చెత్తా??? ఇంత చెత్తగా వుందేం?”

“చెత్త చెత్తగా వుండక ఇంకెలా వుంటుంది?”

“చెత్తకి మాత్రం ఓ పద్ధతీ పాడూ వుండద్దూ?” – వాళ్ళ సందేహం.

వాళ్ళిలా మాట్లాడుకుంటూ వుండగానే ముఖ్యఅతిథిగారు అందర్నీ తమ దగ్గరికి రమ్మన్నారు. పరిస్థితి గమనించారు. ఏదో పొరబాటు జరిగింది. అర్జెంటుగా మీటింగు ఏర్పాటు చేసి హడావిడిగా కారెక్కారు. ఈగల్లా ముసురుతున్న మీడియా వాళ్లను తప్పించుకుంటూ వాళ్ళ మొహాల మీద తలుపులు వేసుకుంటూ అందరూ కార్లెక్కి వెళ్ళిపోయారు. కాసేపట్లో అక్కడంతా ఖాళీ.

“ఏం జరిగిందో అర్థం కావడం లేదు. ముందు ఏం జరుగుతుందో అసలే అంతుపట్టడం లేదు. అడిగినా చెప్పే నాథుడే లేడు. అధికార పక్షం వారంతా మొహం చాటేస్తున్నారు. అంతా అయోమయంగా ఉంది.

“అదుగో ఇటు చూడండి. అభం శుభం తెలియని ఆ చెత్త లారీలు, సౌభాగ్యం కోల్పోయిన స్త్రీల వలె ఎంత దీనంగా నిలబడి వున్నాయో!

“కోట్లాది ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఈ చెత్త కర్మాగారానికి ఈ విధంగా పురిట్లోనే ఎందుకు సంధి కొట్టిందో చెప్పవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. చెత్త కర్మాగారం ప్రారంభోత్సవ స్థలం నుండి కెమెరామేన్ వరప్రసాదరావుతో వసంతలక్ష్మి”.

అంటూ ప్రసారం చేస్తున్నాయి టి.వి. ఛానెల్సు.

అక్కడ మీటింగ్ హాల్ దద్దరిల్లిపోతోంది.

సంబంధిత అధికారులు అందర్నీ వరసన పిల్చి మొహం వాచేలా చీవాట్లు పెడుతున్నారు శ్రీవారు.

మరో పక్క ఆ దేశం ఇంజనీర్లు, దేశం ఇంజనీర్లు వాదించుకుంటున్నారు. అందరినీ నిలదీశారు శ్రీవారు.

“మేము బానే చేశాము. అయినా ప్లాంటులో ఏ దోషం లేదు. తిరకాసు అంతా

చెత్తలోనే వుంది. మా దేశంలో ఇలా వుండదు చెత్త. డీ కంపోజ్ అయ్యే చెత్తని రీసైకిల్ చేసి ఎరువుగా మారుస్తాం. ప్లాస్టిక్ వగైరాలని కరిగించి రోడ్ల రిపేర్లకు వాడతాం. మరి ఇక్కడ అరటి తొక్కలు మొదలు కొని గాజు పెంకుల వరకూ, ప్లాస్టిక్ కవర్లు మొదలుకొని విరగ్గొట్టిన కట్టడం అవశేషాల వరకూ అంతా ఒక్కటిగానే ఉంది" అన్నారు బండోడియా వాళ్ళు.

"మీరా ముక్క ముందే ఎందుకు చెప్పలేదు మాతో?" అన్నారు మన వాళ్ళు.

"మీరు మాకు ఏం చెప్పారు? సగటున రోజుకి ఎంత చెత్త తయారవుతుందో, లెక్కలు వేసి చెప్పారు. అప్పుడే చెత్త చూపిస్తే మా వల్ల కాదని ముందే చెప్పేవాళ్ళం" అన్నారు వాళ్ళు.

"అవునుస్మీ తప్పే" అని నాలుకలు కొరుక్కున్నారు మనవాళ్ళు.

"సరే వాళ్ళు ఇక్కడి చెత్త చూళ్ళేదు. మనవాళ్ళు చాలామంది వెళ్లేరుగా. వాళ్ళేం చేశారు? అక్కడి చెత్త ఎలా వుంటుందో చూళ్ళేదా?" నిలదీశారు శ్రీవారు.

అంతా బుర్రలు గోక్కున్నారు.

"ఏదో తేరగా వస్తోందని పెళ్ళాం పిల్లల్తో విహారయాత్రగా వెళ్ళారేగానీ చెత్తకోసం ఎవరెళ్ళారు?"

చిర్రెత్తుకు వచ్చింది శ్రీవారికి.

"వెళ్తే వెళ్ళారు ఆ మాత్రం తెలివి తేటలుండద్దూ. ఓ మారు అలా వెళ్ళి చెత్తమీద ఓ కన్నేసి వస్తే ఈనాడు ఈ దుస్థితి వచ్చేదేనా?" అన్నారు.

వాదోపవాదాలు తారాస్థాయికి చేరాయి. "మీవాళ్ళే వెళ్ళారు" అంటే కాదు "మీ వాళ్ళే" అనుకున్నారు.

అప్పుడు కల్పించుకున్నారు ఓ పెద్దాయన.

"గతం గతః ప్రస్తుతం ఏ జరగాలో అది ఆలోచించండి. అక్కడ అపోజిషన్ వాళ్ళు అప్పుడే అట్టముక్కలూ, దిష్టి బొమ్మలూ పుచ్చుకుని రాస్తారోకోకి బయలు దేరారు" అన్నారు.

బండోడియా వాళ్ళని పిల్చి కిం కర్తవ్యం అన్నారు.

"ఈ చెత్తకి ఈ ప్లాంటు పనిచెయ్యదు" – ఒక్క మాటలో చెప్పేశారు వాళ్ళు.

"పోనీ ఆ చెత్తంతా వేరు చేసుకుని పనికి వచ్చే చెత్తను రీసైకిల్ చేసి పనికిరాని

చెత్తను పారేసేలా మార్చగలరా ఈ ప్లాంట్‌ని. దానికోసం అవసరం అయితే మరికొంత ఖర్చు పెట్టడానికి సిద్ధమే మేము" అన్నారు.

"అబ్బే అలా లాభం లేదు. అసలా టెక్నాలజీ అంతా వేరే" అన్నారు వాళ్ళు.

"ఏం చెయ్యాలి? కింకర్తవ్యం?" అందరూ బుర్రలు పట్టుకున్నారు.

"పోనీ ఓ పని చేస్తే - చెత్తని విడివిడిగా వెయ్యాలి. లేకపోతే పోలీసులకి పట్టిస్తాం అని ప్రజలని బెదిరిస్తే ఎలా వుంటుంది?" ఒకావిడకి ఆలోచన వచ్చింది.

"ఏం లాభం లేదు. అలా చేస్తే పోలీసులు బాగుపడతారు తప్పించి సమస్య సమస్యగానే వుంటుంది" నీరు కార్చేశాడు ఒకాయన.

"నాకు మంచి ఆలోచన వచ్చింది. చెత్తంతా ఏరించి ఎరువుకి పనికొచ్చేవన్నీ ప్లాంటుకి వేయించి పనికిరాని వాటిని మళ్ళీ చెత్తలో పడేస్తే సమస్య పరిష్కారం అవుతుందేమో" అన్నాడు మేధావి. "ఏడిసినట్లు వుంది. చెత్త యథాతథంగా పారబోయడానికే చోటు చాలక ఛస్తుంటే చెత్తని పరిచి ఏరించాలంటే ఎంత స్థలం కావాలీ? స్థలం మాట అటుంచి ఎంతమంది మనుషులు కావాలి? బాలకార్మికులు పనికిరారు? పెద్దవాళ్ళని పెట్టుకుంటే యూనియన్లంటూ ఉద్యోగాలివ్వమంటారు. ఇళ్ళ పట్టాలు కావాలంటారు. ఇదంతా అదనపు తలనొప్పి" అన్నాడు మరో మేధావి.

అంతా తలలు పట్టుకుని కూర్చున్నారు.

అంతలో ఫోను మోగింది. అధిష్ఠానం నుండి ఫోను శ్రీవారికి.

"ఏమిటయ్యా చెత్త గొడవ. మీ అపోజిషన్ వాళ్ళు ఫోన్ చేసి గొడవ చేస్తున్నారు. అయినా చేతా వాతా గాని పన్లెందుకు చేస్తారండీ? నోరు మూసుకుని కూర్చుంటే భేషుగ్గా వుంటుంది కదా! ఇప్పుడీ సమస్యని ఎలా పరిష్కరిస్తారో నాకు గంటలో చెప్పండి" అని మందలించారు.

శ్రీవారు కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యారు.

అందరూ తలలు పట్టుకుని కూర్చున్నారు.

బండోడియా వాళ్ళకి జాలి వేసింది. పక్కకెళ్ళి బండోడియా భాషలో మాట్లాడుకున్నారు. బండోడియాకి ఫోన్ చేసి మాట్లాడేరు. మన వాళ్ళ దగ్గరకి వచ్చారు.

చూడండి జరిగినదానికి మా పొరబాటు ఏమీ లేకపోయినా మాకూ బాధగానే వుంది. చాలా దేశాల్లో మేము వెళ్ళి చెత్త కర్మాగారాలు కట్టించాం. ఎక్కడా ఇలా జరగలేదు. మేం ఒక ఉపాయం ఆలోచించాం. ఈ కర్మాగారానికి మీ చెత్త పనికి

రాదు. కట్టిన ఫ్యాక్టరీని కదిలించలేం. కాబట్టి మా దేశంలోని చెత్తని మీరు దిగుమతి చేసుకోండి. రవాణా ఖర్చులు మీవే. తయారైన ఎరువు చెరి సగం పంచుకుందాం. మీకు మా ఆలోచన నచ్చితే మాకు తెలియజేస్తే ఆ విధంగా ఒప్పందం కుదుర్చుకుందాం" అని చెప్పి వాళ్ళ దేశానికి వెళ్ళిపోయారు.

మర్నాటికి భగ్గుమంది ఈ వ్యవహారం.

అపోజిషన్ వాళ్లు దుమ్ము తూర్పార పడుతున్నారు.

అధిష్టానం వారు మొట్టికాయలు వేస్తున్నారు.

మళ్ళీ అత్యవసర సమాచారం ఏర్పాటు అయింది.

పోనీ ఆ బండోడియా వాళ్ళు సూచించిన మార్గం అనుసరిద్దామా? అని చర్చించుకున్నారు.

బండోడియా దేశానికి వెళ్ళాలంటే విమానంలోనే ఇరవై గంటల ప్రయాణం దూరభారం.

వాయుమార్గాన చెత్తని తీసుకురావడం చాలా ఖర్చుతో కూడుకున్న పని. కాబట్టి సముద్రమార్గాన ఓడల్లో చెత్త తెచ్చుకోవాలి. మన నగరానికి సముద్రానికి చాలా దూరం వుంది. అతి దగ్గర్లో వున్న పోర్ట్ దాకా ఓడల్లో తెచ్చి అక్కడినించి లారీల్లో మన ప్లాంటుకి తెచ్చుకుని రీ సైకిల్ చేసుకోవాలి.

వచ్చిన ఎరువులో సగం వాళ్ళకి పంపించాలి. ఆ పంపడానికి కూడా లారీలు, ఓడలు కావాలి.

ఖర్చు అవుతుంది కానీ అంత ఖర్చు పెట్టి కట్టించిన చెత్త కర్మాగారం పనికి రాకుండా పాడుపెట్టారనే అపకీర్తి తప్పుతుంది.

ఈ ప్లాను మీద చర్చలు జరపడానికి ముగ్గురు సభ్యులున్న ఒక బృందాన్ని బండోడియా పంపించాలని నిర్ణయించి సభ ముగించారు.

*డిసెంబర్ 2008 రచన మాసపత్రిక*